సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 4 । మార్చి । 2023



ఆధార్ అప్‌డేట్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 222 శాశ్వత కేంద్రాలు, సచివాలయాల ద్వారా ఆధార్ కార్డు అప్‌డేట్‌కు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

-IIలో ▸



రోడ్డు ప్రమాదం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు.

-IIలో ▸



జనారణ్యం.. కొల్లేటికోట

కొల్లేటికోటలో పెద్దింట్లమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బోనాలు, ప్రభల ఊరేగింపు ఆకట్టుకున్నాయి.

-IIలో

న్యూస్‌రీల్

గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్



నిట్ సందర్శనంలో నన్నయ వర్సిటీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్ అని ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధిపతి డాక్టర్ వి.సందీప్ అన్నారు. రాజమండ్రి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి చెందిన 40 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు శుక్రవారం నిట్‌ను సందర్శించారు. ఎలక్ట్రికల్ మెషీన్ ప్రయోగాల గురించి విద్యార్థులకు సందీప్ వివరించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. దీనికి తగినట్టు కంపెనీలు విస్తృత పరిశోధనలు చేస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరగనుందన్నారు. విద్యార్థులు విభిన్నంగా ఆలోచించి కొత్తరకాల ఎలక్ట్రికల్ వాహనాల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల పనితీరు, జనరేటర్‌లో విద్యుతుత్పత్తి, మోటార్ అప్లికేషన్, సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ మోటారు స్టార్టర్ల పనితీరుపై ప్రయోగశాల ఇన్‌చార్జి డాక్టర్ టి.రమేష్ వివరించారు. వర్సిటీ సహాయ ఆచార్యులు డాక్టర్ డి.కిషోర్, డాక్టర్ జి.కీర్తి పాల్గొన్నారు.

వేడుకగా ఏకాదశి ఉత్సవం



తొళక్క వాహనంపై ఊరేగింపు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో స్వామివారి ఏకాదశి ఉత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. అడుగడుగునా భక్తులు నీరాజనాలు అర్పించారు.

నేత్రపర్వం.. రథోత్సవం



బల్లిపాడులో రథోత్సవం

అత్తిలి: బల్లిపాడులో రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి పల్లకిపై తీసుకువచ్చి రథంపై ఆశీనులు గావించారు. అనంతరం అర్చకులు పూజాదికాలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు స్వామివారికి అరటిపండ్ల గెలలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తణుకు సీఐ ఆంజనేయులు నేతృత్వంలో అత్తిలి ఎస్సై సీహెచ్‌కే స్వామి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, కార్యనిర్వహణాధికారి చందక దారబాబు, పాలకమండలి సభ్యులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట చేల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న బృందం

ఆకివీడు: వంతుల వారీ నీటి సరఫరాలో ఇబ్బందులుంటే రైతులు వెంటనే తెలియజేయాలని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. వంతుల వారీ నీటి సరఫరా విధానాన్ని మండల బృందం శుక్రవారం మాదివాడ, ఆకివీడు ఆయకట్టులో పరిశీలించింది. ఈనెల 1 నుంచి వంతుల వారీ నీరు విడుదలైందని, నీరందుతున్న తీరుపై బృందం పరిశీలించిందని ఏడీఏ తెలిపారు. నీరందని రైతులు వ్యవసాయాధికారులు, వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కంట్రోల్ రూమ్ 08816 234197 ను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వర్లు, ఏఓ ప్రియాంక, ఇరిగేషన్ డీఈ మూర్తి, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ పెద్దిరాజు, ఎంపీడీఓ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

టార్గెట్.. ఉగాది

సంవత్సరాది నాడు పేదలతో గృహప్రవేశాలు చేయించి వారి ఏళ్లనాటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణాలకు ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా ఉగాది నాడు పెద్ద ఎత్తున గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గృహనిర్మాణాలు ఊపందుకున్నాయి. మొత్తంగా 48 వేల ఇంటి నిర్మాణాలను పూర్తి చేయడమే లక్ష్యంగా నిర్దేశించి పక్కా కార్యాచరణ అమలు చేస్తున్నారు.

శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

- ఉమ్మడి జిల్లాలో 48వేల ఇళ్ల పూర్తి లక్ష్యం
- పండగ నాడు గృహప్రవేశాలకు సన్నాహాలు
- లేఅవుట్లలో సకల సదుపాయాలు
- ప్రతివారం అధికారులతో సమీక్ష





ఏలూరు రూరల్ చొదిమెళ్ల జగనన్న కాలనీలో నిర్మాణాలు, (ఇన్‌సెట్‌లో) పూర్తయిన ఇళ్లు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటి నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. అధికారులు ప్రథమ ప్రాధాన్యంగా గృహనిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గృహనిర్మాణ శాఖాధికారులు జగనన్న లేఅవుట్లలో సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. అలాగే రెండు జిల్లాల కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతి ఆధ్వర్యంలో ప్రతి వారం గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తద్వారా ఎప్పటికప్పుడు గృహనిర్మాణాలను పూర్తిచేసేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు. ప్రతి మండలంలో మండల స్థాయి అధికారులు బాధ్యులుగా వ్యవహరిస్తూ గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుమును లబ్ధిదారులకు త్వరితగతిన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఏలూరు జిల్లాలో 25 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 23 వేల ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. లేఅవుట్ల వద్ద వసతుల కల్పనతో పాటు పారిశుధ్యానికి సైతం అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు.

ఏలూరు జిల్లాలో.. ఏలూరు జిల్లాలో 88,190 గృహాలు మంజూరు కాగా.. 84,525 నిర్మాణాలను లబ్ధిదారులు చేపట్టారు. వీటిలో ఇప్పటివరకూ 19,620 నిర్మాణాలు పూర్తికాగా మరో 6 వేల ఇళ్లను ఉగాది నాటికి పూర్తిచేసి మొత్తం 25 వేల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు కృషిచేస్తున్నారు.

పశ్చిమగోదావరిలో.. పశ్చిమగోదావరి జిల్లాలో 71,864 గృహాలు మంజూరు కాగా.. 68,906 నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభించారు. వీటిలో 19,017 గృహాలు ఇప్పటికే పూర్తికాగా మరో 4 వేల ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేసి మొత్తంగా 23 వేల గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఉగాది నాడు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా లబ్ధిదారులకు ఇంటి తాళాలు అప్పగించి గృహప్రవేశాలు చేయించనున్నారు.

వసతుల కల్పన : లేఅవుట్లలో గృహనిర్మాణాలు పూర్తి చేయడం పాటు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. అలాగే పారిశుధ్యానికి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

25 వేల ఇళ్లు



రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలో ఉగాది నాటికి 25 వేల గృహ నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంటి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పనుల వేగవంతానికి కృషి చేస్తున్నాం.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

సకల సదుపాయాలతో..



పశ్చిమగోదావరి జిల్లాలో 23 వేల ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకున్నాం. అలాగే లేఅవుట్ల వద్ద సకల వసతులు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. ఈ మేరకు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

మాదక ద్రవ్యాలను పారద్రోలుదాం

కలెక్టర్ ప్రశాంతి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: సమాజం ఆరోగ్యవంతంగా, కాంతియుతంగా ఉండాలంటే మాదకద్రవ్యాల వాడకాన్ని పారద్రోలాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగిస్తే వ్యక్తి స్థిరత్వాన్ని కోల్పోయి గొడవలు, కొట్లాటకు కారణమవుతారన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతిఒక్కరూ సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి పురోభివృద్ధికి పెనుభూతమైన గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రధానంగా యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి జీవితాలతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. విద్యార్థులు డ్రగ్స్ అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు, సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీ ఎస్ఎస్ వర్మ, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం చరిత్రాత్మకం

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్



ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ బోస్, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్రీనివాస్, రవీంద్రనాథ్

పెనుగొండ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ విజయానికి ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఎంపీటీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో తొలి ఎమ్మెల్సీ ఎస్సీ సామాజిక వర్గం నుంచి కొయ్యే మోషేన్‌రాజుకు ఇచ్చి శాసనమండలి స్పీకర్‌ను చేశారని, ఇప్పుడు శెట్టిబలిజ (బీసీ) వర్గం నుంచి కవురు శ్రీనివాస్‌కు, కాపు సామాజిక వర్గం నుంచి వంక రవీంద్రనాథ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి సీఎం జగన్ సామాజిక న్యాయం పాటించారన్నారు. 65 శాతానికి పైగా బీసీ అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా నిలిపిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. పార్టీ అభ్యర్థులు కవురు, వంక విజయానికి కృషిచేయాలన్నారు.

నిబద్ధతకు పట్టం

పార్టీలో నిబద్ధతతో పనిచేసిన వారికి అవకాశాలను సీఎం జగన్ కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. దళితులు, బీసీలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్సీలు రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా వ్యవహరించిన వారే కావడం విశేషమని రుడా చైర్మన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకరాలు మేడపాటి షర్మిళ అన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి

పెనుగొండ బహిరంగ సభలో ఇచ్చిన మాటకు కట్టుబడి మడం తిప్పకుండా సీఎం జగన్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం తనకు కేటాయించారని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. బీసీలంతా ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. తాను 2014లో ఎంపీగా పోటీచేశానని, అనంతరం కూడా ఎంతో ప్రాముఖ్యత ఇస్తూ సీఎం జగన్ అండగా నిలిచారని మరో ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్ అన్నారు. సీఎం జగన్ కాపులకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాశ్, ఎంపీపీలు కేఎస్ నారాయణరెడ్డి(వాసు), పూతినీడి వెంకటేశ్వరరావు, సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, పోడూరి గోవర్ధన, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు

మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్య నియంత్రణకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో దుమ్ము, ధూళి ఎక్కువగా గాలిలోకి వ్యాపిస్తుందని, నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. చెత్తను తగలపెట్టకుండా చూడటం, చెత్తను, ప్లాస్టిక్ పదార్థాలను వేరు చేసి తరలించడం, రోడ్డు మార్జిన్లలో దుమ్ము లేవకుండా పేవర్ బ్లాక్స్ ట్రాఫిక్ ఐలాండ్స్ వద్ద వాటర్ ఫౌంటెన్ల ఏర్పాటు, భవనాలు తొలగించడం, నిర్మాణాలు తద్వారా వచ్చే రద్దును నిర్దేశిత ప్రాంతాలకు తరలించడం, మొక్కలు నాటడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. భవనాలను కూల్చే సమయంలో యజమానులు తప్పనిసరిగా సంబంధిత సచివాలయానికి సమాచారం అందించాలన్నారు. శ్మశాన వాటికల్లో యంత్రాల ఏర్పాటుకు కమిషనర్లు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేలా బాధ్యతలను సరైన వారికి అప్పగించాలన్నారు. రోటరీ, లయన్స్, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలకు మొక్కలు నాటే బాధ్యతను అప్పగించాలని సూచించారు. ఏలూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ వెంకటేశ్వర్లు, ఎంఈఐ కేఎస్ఎన్ ప్రసాద్, పరిశ్రమ శాఖ ఐపీఓ జె.శ్రీపతి, తణుకు మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన.. ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

యలమంచిలి: యలమంచిలి మండలం కలగంపూడి గ్రామానికి ఈనెల 5న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈనేపథ్యంలో చించినాడ–దిగమర్రు బైపాస్ రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్టు యలమంచిలి ఎస్సై జాజుల విజయప్రసాద్ తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పాలకొల్లు వైపు వెళ్లే వాహనాలను చించినాడ–మేడపాడు మీదుగా, అలాగే నరసాపురం వెళ్లే వాహనాలను చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం మీదుగా మళ్లిస్తామన్నారు.

వంతుల విధానం.. రైతుకు వరం



పాలకొల్లు మండలం లంకలకోడేరులో ఏపుగా పెరిగి దాళ్వా వరిపైరు

సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా వరి సాగు రైతులకు వంతుల వారీ విధానం వరంగా మారింది. శివారు భూములకూ సైతం పుష్కలంగా సాగునీరు అందడంతో వరిపైరులు ఏపుగా పెరిగాయి. అలాగే పెద్దగా చీడపీడలు ఆశించకపోవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో దాదాపు 2.19 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేయగా.. తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు ప్రాంతాల్లో చేలు ఈనిక దశ దాటాయి. అలాగే భీమవరం, ఆకివీడు, పాలకొల్లు, పెనుగొండ, నరసాపురం వ్యవసాయ సబ్‌డివిజన్ల పరిధిలో ఈనిక దశలో ఉండగా ఎక్కువ శాతం చిరుపొట్ట దశలో ఉన్నాయి.

పైరు పచ్చగా.. నీరు సమృద్ధిగా..

- జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు
- శివారు భూములకూ సాగునీరు
- పక్కా ప్రణాళికతో కార్యాచరణ

జిల్లావ్యాప్తంగా అమలు

దాళ్వా నాట్లు ప్రారంభమైన తర్వాత కొన్ని ప్రాంతాల్లో కాలువ శివారు భూములకు నీటి ఎద్దడి నెలకొంది. మెరక భూములకు నీరందకపోవడంతో చేలు బీటలు తీయగా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పక్కాగా వంతుల వారీ విధానం అమలుచేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లావ్యాప్తంగా వంతుల వారీ విధానం అమలులోకి వచ్చింది. దీనిద్వారా అవసరమైన మేరకు మాత్రమే నీటిని అందించడంతో పైరు ఎక్కువగా పిలుకలతో నిండుగా కనిపిస్తోంది. అలాగే ఎలుకలు, క్రిమికీటకాల బెడద లేకపోవడంతో రైతులకు పెట్టుబడుల ఖర్చులు కూడా తగ్గాయి.

ఈనిక దశలో నీరు తప్పనిసరి

సక్రమంగా నీరందడంతో చేలు ఒకేసారి ఈనిక దశ పూర్తిచేసుకుంటున్నాయి. దీని వల్ల గింజల్లో తప్పలు తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉంది. అయితే ఈనిక దశలో చేలలో నీరు తప్పనిసరిగా ఉండేలా రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పైరు పెరిగే సమయంలో చేలలో ఎండు–పండు దశలుగా నీరు పెట్టినా ఈనిక దశలో మాత్రం సమృద్ధిగా నీరందరించాలని అంటున్నారు. అలాగే చిరుపొట్ట దశలో పైరుకు తప్పనిసరిగా ఎకరాకు 20 కిలోల పొటాష్, 15 కిలోల యూరియా వేయాలని చెబుతున్నారు. పొటాష్ వాడకం వల్ల గింజలు గట్టిగా, నాణ్యంగా ఉండటమేగాక వరి ఆకులు గరుకుగా మారి కాండం తొలుచు పురుగు, సుడిదోమ వంటి తెగుళ్ల ఆశించవని అంటున్నారు.

ఇబ్బందులు లేవు



దాళ్వా వరిసాగుకు సాగునీటి సరఫరాలో వంతులవారీ విధానం అమలుచేయడంతో నీటికి ఇబ్బంది లేదు. నాట్లు వేసిన కొత్తలో నీటిఎద్దడి ఏర్పడినా అనంతరం సమస్య తీరింది. ప్రస్తుతం పైరు చిరుపొట్టదశలో ఉన్నందున అధికారులు నీటి ఎద్దడి లేకుండా చూస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశముంది.

– కాపకాయల సత్యనారాయణ, రైతు, పంజావేమవరం

సమన్వయంతో ముందుకు..



జిల్లాలో ఎక్కువ శాతం పైరు చిరుపొట్ట దశలో ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి ఏపుగా పెరిగి పంట ఆశాజనకంగా వచ్చే అవకాశముంది. నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయంతో పనిచేయాలని ఆదేశించాం. సాగునీటి సరఫరాపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



ముంగర జాన్‌బాబు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా పైడిచింతపాడు గ్రామానికి చెందిన ముంగర జాన్‌బాబు (21) గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. దివాన్ చెరువులోని ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. గురువారం రాత్రి సమయంలో స్నేహితుని బైక్ తీసుకుని, మరో స్నేహితుడితో కలిసి రాజమహేంద్రవరం వచ్చాడు. తిరిగి వెళ్తుండగా దివాన్‌చెరువు జీరోపాయింట్ వద్ద బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జాన్‌బాబును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బైక్ వెనుక స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ జాన్‌బాబు శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అతడి చిన్నాన్న నాగరాజు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విశాఖ వెళ్లి పెన్షన్ అందజేత



విశాఖ సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పెన్షన్ అందచేస్తున్న వలంటీరు జ్యోతి

ఉంగుటూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు అల్లు రవణమ్మకు విశాఖ వెళ్లి ఉంగుటూరు మండలం రాచూరు సచివాలయ పరిధిలోని సీతారామపురం వలంటీరు పింఛను అందజేశారు. కూతురిని చూసేందుకు విశాఖ వెళ్లి బాత్‌రూంలో పడిపోవడంతో సెవన్ హిల్సు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సచివాలయ ఉద్యోగులు, పలువురు గ్రామ నాయకులు వలంటీరు జ్యోతిని అభినందించారు.

బాలికను మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం బాలికను ఒక యువకుడు ప్రేమ పేరు మోసగించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామానికి బాలికకు సోషల్ మీడియాలో హైదరాబాద్ యువకుడు పరిచయమై పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నెల 20న ఆ యువకుడు దెయ్యాలతిప్ప గ్రామానికి వచ్చి సదరు యువతిని హైదరాబాద్‌కు తీసుకువెళ్లినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్

- పదేళ్లు దాటితే ధ్రువీకరణ తప్పనిసరి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 222 శాశ్వత ఆధార్ సెంటర్లు ఏర్పాటు
- దశల వారీగా ప్రతీ సచివాలయంలోనూ ఆధార్ కేంద్రం



ఏలూరు(మెట్రో): ప్రభుత్వ పథకాలు అందాలన్నా, ప్రజలు ఏ లబ్ధి పొందాలన్నా ప్రస్తుతం ఆధార్ తప్పనిసరి అయ్యింది. ఆధార్ కార్డు ఉంటేనే దేనికైనా ప్రయోజకులుగా గుర్తిస్తున్నారు. దీంతో ఆధార్ కార్డు ప్రతి ఒక్కరికి ప్రాథమిక గుర్తింపుగా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని యుఐడీఏఐ స్పష్టం చేసింది. దీంతో మరో మారు ఆధార్ కార్డు అవసరత తెరమీదకు వస్తోంది. ఆధార్‌కార్డు తీసుకుని పదేళ్లు పూర్తయ్యి ఇప్పటికీ అదే చిరునామాలో ఉన్నప్పటికీ ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని యుఐడీఏఐ స్పష్టం చేసింది. పదేళ్లలో ఒక్కసారి కూడా సగం పైగా ప్రజలు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోలేదని గుర్తించిన యుఐడీఏఐ ఈ మేరకు అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రతీ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నోటిఫికేషన్ ద్వారా ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధార్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ముఖ్యమైన గుర్తింపు కార్డుల్లో ఒకటిగా చేర్చింది. ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి ఆధార్ తప్పనిసరి చేసింది. ఆధార్ కార్డు బయోమెట్రిక్ ప్రామాణికంతోనే సంబంధిత వ్యక్తుల గుర్తింపు రుజువుగా మారడంతో ఎలాంటి సేవలు పొందాలన్నా ప్రతీ ఒక్కరూ తమ వివరాలను యుఐడీఏఐకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

సచివాలయాల్లోనే ఆధార్ సేవలు

సచివాలయాల్లో ఆధార్ కీలకంగా మారింది. ప్రజలకు ఇప్పటికే గ్రామాల్లో సచివాలయాల ద్వారా సేవలు అందుతున్న నేపథ్యంలో ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు, కొత్త ఆధార్‌ను తీసుకునేందుకు సచివాలయాలు ప్రజలకు సేవలు అందించనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో సచివాలయాల సంఖ్యను బట్టి, ఆయా సచివాలయాలకు ఆధార్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఇప్పటికే ఏలూరు జిల్లాలో 122 ఆధార్ సెంటర్‌లను సచివాలయాల్లో ఏర్పాటు చేసి ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా పశ్చిమ గోదావరి జిల్లాకు 105 సచివాలయాల్లో అధార్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే అయా సచివాలయాల్లో ఆధార్ కిట్లను అప్‌డేట్ చేసి యుఐడీఏఐకి ఆయా జాబితాను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఈ విధంగా ప్రజలకు ఆధార్ సేవలను గ్రామాల్లోనే అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఏలూరు జిల్లాలో 625 సచివాలయాలు ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో 540 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయ పరిధిలోను భవిష్యత్తులో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నూతన ఆధార్ కార్డుల జారీతో పాటుగా ఆధార్‌లో తప్పులు, ఆధార్ అప్‌డేట్‌లు ఆయా సచివాలయాల్లోనే చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే బ్యాంకుల్లోనూ, పోస్టాఫీసుల్లోనూ ఆధార్ సమస్యలకు, ఆధార్‌కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం సచివాలయాల ద్వారా సైతం ఆధార్ సేవలు అందించడంతో ప్రజలకు భవిష్యత్తులో గ్రామస్థాయిలోనే ఆధార్ సమస్యలకు చెక్ పడనుంది.

సాగునీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



రాజుల్లంకలో ఆక్వా చెరువుకు నీటిని అక్రమంగా తోడుతున్న ఇంజిన్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్ : సాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని నీటి చౌర్యాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టామని తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. రెవిన్యూ సిబ్బందితో కలసి శుక్రవారం నరసాపురం మండలంలోని వేములదీవి, దర్బరేవు కాలువల వెంట ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాజుల్లంక, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో పంటకాలువలోని నీటిని అక్రమంగా ఆక్వా చెరువులకు ఇంజిన్ల సాయంతో తోడుతున్న వాటిని గుర్తించారు. నీటిని తోడేందుకు వినియోగిస్తున్న ఇంజిన్లను సీజ్‌చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులకు చెందిన విద్యుత్ కనెక్షన్లు కూడా తొలగించినట్లు ఫాజిల్ పేర్కొన్నారు. శివారు ప్రాంతాల రైతులకు సాగు నీరు అందించేలా వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్న సమయంలో నీటి చౌర్యం చేస్తే కేసులు నమోదుచేస్తామని తహసీల్దార్ ఫాజిల్ పేర్కొన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ : మండలంలోని సిద్ధాంతంలో గడపగడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులకు సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంగర సత్య వెంకటేష్

పాలకొల్లు సెంట్రల్ : స్థానిక పెద్దసాయిబాబా ఆలయం పెంకుళ్లపాడు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం అర్థరాత్రి స్థానిక అచ్చుగట్లపాలెం ప్రాంతానికి చెందిన అంగర సత్య వెంకటేష్ (25), పట్నాల ఆదినారాయణ బయటకు వెళ్లి వస్తున్నారు. అడబాల ఫంక్షన్ హాల్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతంలో చీకటిగా ఉండడం, బారికేడ్లకు రేడియం స్టిక్కర్ లేకపోవడంతో చీకట్లో అవి కనిపించక పోవడం వల్ల వేగంగా వెళుతూ ఈ బారికేడ్‌ను ఢీకొట్టారు. దానితో అంగర వెంకటేష్ తలకు తీవ్ర గాయమవ్వగా ఆదినారాయణకు గాయాలయ్యాయి. ఆదినారాయణ వెంకటేష్ తల్లి దండ్రులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేసరికి అప్పటికే వెంకటేష్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటువైపుగా వస్తున్న ఆటో డ్రైవర్ తన ఆటోలో బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి వెళ్లేటప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. ఆదినారాయణ తలకు, ఒంటికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేష్ తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.ముత్యాలరావు కేసు నమోదు చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 7,607 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రయోగ పరీక్షల్లో శుక్రవారం 7,607 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు 94 కేంద్రాల్లో 5950 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5838 మంది హాజరయ్యారు. మరో 112 మంది గైర్హాజరయ్యారు. 28 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 1969 మంది హాజరు కావాల్సి ఉండగా 1769 మంది హాజరయ్యారు. 200 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

నాటు సారా స్వాధీనం

చింతలపూడి: యర్రగుంటపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై చింతలపూడి పోలీసులు శుక్రవారం దాడులు జరిపారు. దాడుల్లో యర్రగుంటపల్లి శివారు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న చేను సత్యనారాయణను అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా, రెండు అల్యూమినియం పాత్రలు, ఒక డ్రమ్ము స్వాధీనం చేసుకుని 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాగిరెడ్డిగూడెం గ్రామంలో భూక్యా లక్ష్మి అనే మహిళ నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.హరికృష్ణ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

వీరవాసరం: వీరవాసరం వేలమపేటలో శుక్రవారం రాత్రి తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. వీరవాసరం వేలమపేటకు చెందిన బండారు అప్పారావుకి సంబంధించిన తాటాకింట్లో నుంచి పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయటికి వచ్చారు. అగ్నికీలలు పైకి లేవడంతో చుట్టుపక్కల వాళ్లంతా నీళ్లతో మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని వీరవాసం ఎస్సై రమేష్, గ్రామ సర్పంచి చికిలే మంగతాయారు తదితరులు సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

● రైలు పట్టాలపై జీవన పోరాటం



ఒకపక్క వృద్ధాప్యం.. మరో పక్క బతుకుదెరువు కోసం వీపుపై మోయలేని భారం.. జానెడు పొట్ట నింపుకొనేందుకు తప్పని జీవన పోరాటం.. ప్రయాణికులు తాగి పారవేసిన బాటిళ్లను ఏరుకుంటూ వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతో పొట్ట నింపుకోవడం అతని నిత్యకృత్యం. ఇదీ ఏలూరు నరసింహారావు పేటలోని రైలు పట్టాలపై శుక్రవారం కనిపించిన దృశ్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు


కిడ్నాప్ ఘటనలో ఏడుగురిపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పరిధిలో ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేశారనే అభియోగంతో ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు నగరంలోని సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ సమీపంలోని షవర్మా షాపులో పనిచేసేందుకు ఖలీం పాషాను నియమించుకున్నారు. అతను మరో దుకాణంలోనూ పనిచేస్తానంటూ అడ్వాన్స్ తీసుకుని రాకపోవటంతో ఇరు వర్గాలకు వివాదం ఏర్పడింది. షవర్మా దుకాణంలో పనిచేసే ఖలీం పాషాను వేరే దుకాణం యజమాని షకీల్ కిడ్నాప్ చేయించారు. బాధితుడి కథనం ప్రకారం శుక్రవారం నగరానికి చెందిన ఆరుగురు వ్యక్తులను పురమాయించి తనను కిడ్నాప్ చేసి ఒక చోట నిర్బంధించారు, రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

పాలకోడేరు: కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శృంగవృక్షం శివారులో శుక్రవారం కోడిపందాలు నిర్వహిస్తుండగా ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1850 నగదు, కోడి పుంజు, కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనారణ్యం.. కొల్లేటికోట





కలువ బోనాలతో వస్తున్న వడ్డీలు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రీ సంతోషి

కై కలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో కొల్లేటికోట శుక్రవారం మార్మోగింది. ఫిబ్రవరి 21న ప్రారంభమైన పెద్దింట్లమ్మ జాతరలో కీలక ఘట్టమైన శ్రీ జలదుర్గ, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం రాత్రి అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయ ఈవో కేవీ గోపాలరావు, చైర్మన్ పులవర్తి లక్ష్మణ్, ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. సమీప జిల్లాల నుంచి వేలాదిగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మకు నవగ్రహ హోమం, బలిహరణ, పుష్పాలంకరణ, ధూప సేవ, బాలభోగం నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) దంపతులు అమ్మవారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రభ ఊరేగింపును పందిరిపల్లిగూడెంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ ప్రారంభించారు. కేరళ సంప్రదాయ నృత్యాలు, శక్తి వేశాలు, గరగడప్పులు, ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న ప్రభ ఊరేగింపు...

పందిరిపల్లిగూడెం నుంచి ప్రభ ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. ప్రతీ ఏటా కల్యాణం రోజున జలదుర్గాదేవికి సారెను గ్రామస్తులు అందిస్తారు. కొల్లేటిగ్రామాలకు చెందిన ప్రజలు ప్రభ ఊరేగింపులో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభల బండికి దేవదాయశాఖ సిబ్బంది స్వాగతం పలికారు. ఏలూరు జిల్లాల్లో శృంగవరప్పాడు, పైడి చింతపాడు, ప్రత్తికోళ్లలంక, చెట్టుంపాడు, ఆగడాలలంక, నుచ్చుమిల్లి, గుడిపాడు, శ్రీపర్రు, పెంచికలమర్రు, గుమ్మళ్ళపాడు, పెదకొట్టాడ గ్రామాల నుంచి మహిళలు హాజరయ్యారు. రాష్ట్ర వడ్డీలు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రి సంతోషి బోనం ఎత్తుకుని ముందు వరసలో నడిచారు. కైకలూరు సీఐ వైవీవీఎల్.నాయుడు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవంలో ఎంపీపీ అడవి కృష్ణ, ముంగర నరసింహారావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు భత్రాజు శివాజీ, కొల్లేటిలంక గ్రామాల సర్పంచ్‌లు ఘంటసాల భాగ్యలక్ష్మీ, బలే వెంకటేశ్వరరావు, కాసులు, ఘంటసాల జగన్నాథం, సముద్రుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రభ ఊరేగింపు వద్ద ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ

డి.జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., ప.గో.జిల్లా, ఏలూరు, బ్రాంచ్ : తాడేపల్లిగూడెం మెయిన్

బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, తాడేపల్లిగూడెం గ్రామములో గల డి.సి.సి. బ్యాంకు బ్రాంచి తాడేపల్లిగూడెం మెయిన్ ఆఫీస్ నందు ఈ దిగువ తెలిపిన బకాయి బాకీదారులు సదరు బ్యాంకులో లోను తీసుకుని తిరిగి చెల్లించలేకపోవుట వలన వీరు బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులను ఈ దిగువ తెల్పిన తేదీలలో డిప్యూటి రిజిస్ట్రార్/ ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఏలూరు వారి ఉత్తర్వులు ప్రకారం ది.08.03.2023, ది.09.03.2023 ది.10.03.2023, బుధవారం,గురువారం,శుక్రవారం తేదీలలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఏలూరు సేల్ ఆఫీసర్ వారిచే డిసిసి బ్యాంకు బ్రాంచి తాడేపల్లిగూడెం మెయిన్ ఆఫీసు భవనము నందు ఈ దిగువ తేదీలలో బహిరంగముగా వేలము వేయబడును. కావున ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చును.

వ. నెం.	ఇ.పి.నెం.	బాకీదారు పేరు	ఆస్తి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం యం.సెంట్లు	సరిహద్దులు	చెల్లించవలసిన మొత్తం రూపాయలు	వేలం వేయు తేది సమయము, స్థలము
1.	328/22-23	శెట్టెం ఫ్లారెన్స్ తండ్రి: వి.వి.సత్యనారాయణ బాదంపూడి	బాదంపూడి	ఆర్.ఎస్.నెం. 121/1 డోర్.నెం. 4-149	242 చ॥గ॥	[illegible]	రూ.9,03,315/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 ఉ.10.00లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
2.	415/22-23	పసుపులేటి అన్నపూర్ణ భర్త :సత్యనారాయణ అనంతపల్లి	అనంతపల్లి	ఆర్.ఎస్.నెం. 447/2 డోర్.నెం. 6-8	100 చ॥గ॥	[illegible]	రూ.8,14,371/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 ఉ.10.30లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
3.	113/22-23	తుమ్మలపూడి నాగేశ్వరరావు తండ్రి : నరసింహమూర్తి సీలాద్రిపురం	సీలాద్రిపురం	డోర్.నెం. 2-11	197 చ॥గ॥	[illegible]	రూ.5,81,402/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది : 08-03-2023 ఉ.12.30లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
4.	108/22-23	పెదమూర్తి చిన్నిరాజు తండ్రి: సూరయ్య మెట్ట ఉప్పరగూడెం తాడేపల్లిగూడెం (మం)	మెట్ట ఉప్పరగూడెం	ఆర్.ఎస్.నెం 108/1	484 చ॥గ॥	[illegible]	రూ.6,53,676/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 మ.01.00లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
5.	117/22-23	గండెల్లి లక్ష్మీ భర్త: శ్రీను తాడేపల్లిగూడెం	తాడేపల్లిగూడెం	ఆర్.ఎస్.నెం. 70/1బి ప్లాట్ నెం. 14	128.33 చ॥గ॥	[illegible]	రూ.14,20,507/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 మ.02.30లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
6.	101/22-23	యాదవపుల రామ్‌సింగ్ తండ్రి: పుల్లయ్య అచ్చన్నపాలెం	అచ్చన్నపాలెం	ఆర్.ఎస్.నెం. 329 డోర్.నెం 2-64	242 చ॥గ॥	[illegible]	రూ.8,38,428/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 మ.3.00లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
7.	122/22-23	దూలపల్లి ప్రభాకరరావు తండ్రి: వీరాస్వామి ప్రకాశరావుపాలెం	ప్రకాశరావుపాలెం	ఆర్.ఎస్.నెం. 221/8 డోర్.నెం. 2-10-7	145.2 చ॥గ॥	[illegible]	రూ.8,83,365/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 సా.4.00లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
8.	430/22-23	దెవల శ్రీనివాసరావు తండ్రి: సూర్యారావు కడియద్ద	కడియద్ద	ఆర్.ఎస్.నెం 458/2 డోర్.నెం. 2-30	253.11 చ॥గ॥	[illegible]	రూ.4,65,024/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 08-03-2023 సా.5.00లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
9.	188/20-21	ములపర్తి నాగమణి భర్త : అర్జునరావు కడకట్ల,తాడేపల్లిగూడెం	కడకట్ల, తాడేపల్లిగూడెం	డోర్.నెం. 14-29-17	144-5 చ॥గ॥	[illegible]	రూ.12,19,156/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 09-03-2023 మ.2.30 లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
10	402/22-23	కూనపాముల రవి తండ్రి: మునలయ్య జగ్గన్నపేట	జగ్గన్నపేట	ఆర్.ఎస్.నెం. 42/2 డోర్.నెం. 1-59	145.2 చ॥గ॥	[illegible]	రూ.7,37,587/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 10-03-2023 ఉ.10.00 లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
11	245/22-23	అద్దెలి సోమాలు భర్త :వెంకట రమణ అనంతపల్లి	తాళ్ళముదునూరు పాడు	ఆర్.ఎస్.నెం. 52/2బాడ్ డోర్.నెం. 10-8-4	240 చ॥గ॥	[illegible]	రూ.32,19,787/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 10-03-2023 ఉ.10.30 లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
12	356/22-23	కుందేటి వెంకటలక్ష్మి భర్త: శ్రీనివాస దుర్గారావు తాడేపల్లిగూడెం	తాడేపల్లిగూడెం	ఆర్.ఎస్.నెం. 20/4 డోర్.నెం. 14-20-18	128 చ॥గ॥	[illegible]	రూ.5,55,477/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 10-03-2023 ఉ.11.30 లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
13	367/22-23	కూతాడ వీరమ్మ భర్త :నారాయణ అత్తిలి	అత్తిలి	ఆర్.ఎస్.నెం. 810/11	200 చ॥గ॥	[illegible]	రూ.6,98,821/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 10-03-2023 మ.3.00 లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు
14	376/22-23	పిన్నింటి పావని భర్త : శ్రీనివాసరావు తంగెళ్ళమూడి	తంగెళ్ళమూడి	ఆర్.ఎస్.నెం. 20/2బి ప్లాట్ నెం. 23	129.5 చ॥గ॥	[illegible]	రూ.11,60,873/- (+)తదుపరి వాయిదాలు (+)తదుపరి వడ్డీ (+)ఇతర ఖర్చులు	తేది. 10-03-2023 మ.3.00 లకు తాడేపల్లిగూడెం డి.సి.సి బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ నందు

సూచనలు: 1) వేలములో పాల్గొనదలచిన వారు వేలము అధికారి వద్ద రూ.10,000/- లు ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. పాన్‌కార్డు,మరియు ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకురావలెను. 2) వేలము పాట అయిన వెంటనే హెచ్చు పాట దారులకు వేలము ఖరారు చేయబడును. 3) సదరు పాట సొమ్ములో 15% వాటా వేలం పూర్తి అయిన వెంటనే చెల్లించవలెను. సొమ్మును వేలము జరిగిన 15 రోజులలో పూర్తిగా చెల్లించవలెను. 4) డిప్యూటీ రిజిస్ట్రార్/ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ డి.సి.సి. బ్యాంకు ఏలూరు నుండి క్రయదస్తావేజును సొంత ఖర్చులపై రిజిస్ట్రేషన్ చేయించుకొనవలెను. 5) వేలము పాట ఏ కారణము చూపకనే రద్దు పరుచుటకుగాని వాయిదా వేయుటకుగాని సేల్ ఆఫీసర్ వారికి సర్వహక్కులు ఉన్నవి. 6) వేలమునకు సంబంధించిన వివరములు సేల్ ఆఫీసర్ ద్వారా గాని డి.సి.సి.బి. తాడేపల్లిగూడెం మెయిన్ బ్రాంచ్ , మేనేజరు వారి ద్వారా తెలుసుకొనవలెను. 7) పాట దారులు ఎవరు హాజరుకాని యెడల సదరు వేలం వేయు ఆస్తులు బ్యాంకునకు దాఖలు చేయబడును. 8) బాకీ దారులు తనఖా పెట్టబడిన పై స్థిరాస్తిపై మరి ఏయితర బకాయిలు ఉన్నను పాట సొమ్ము నుండి వసూలు చేయబడును.

బ్రాంచ్ మేనేజర్
డి.సి.సి.బి, తాడేపల్లిగూడెం మెయిన్ బ్రాంచ్

వెలగల నర్సిరెడ్డి, సేల్ ఆఫీసర్
డి.సి.సి.బి, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

నూతన భవనంలోకి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు



బ్యాంకు భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణబ్యాంకు నూతన భవనాన్ని బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం, బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ సతీష్, పెదతాడేపల్లి సొసైటీ అధ్యక్షుడు పరిమి తులసీదాస్, బ్రాంచ్ మేనేజర్ పి.సంతోష్ కుమార్, ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు కోట రాంబాబు, ఐనం బాలకృష్ణ, కొండపల్లి నగేష్, ముప్పిడి సురేష్ రెడ్డి, ఐనపర్తి శ్రీదేవి, గరగ ప్రసాద్, తుమరాడ చిన్నా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ పార్కు అభివృద్ధి



పార్కులో మొక్కలు నాటుతున్న కమిషనర్

తాడేపల్లిగూడెం (టీఓసీ) / తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో 11వ వార్డు మహాలక్ష్మి నగర్ రోడ్డు నెంబర్ 4లో మునిసిపల్ ఖాళీ స్థలంలో జాయింట్ కలెక్టర్ సూర్యతేజ ఆదేశాలు మేరకు పార్కును అభివృద్ధి చేశారు. 1273 గజాల స్థలంలో మట్టి పూడిక చేసి, శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యోగ గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్, న్యాయవాది మాకా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా సభ్యులచే యోగా ఆసనాలు, సూర్యనమస్కారాలు ప్రదర్శించారు. మునిసిపల్ కమిషనర్ బాలస్వామి, ఎంఈ మురళీకృష్ణ, ఏఈ బి.కుబియానాయక్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు వృథా కానివ్వొద్దు

అత్తిలి: వంతులవారీ విధానంలో సరఫరా అయ్యే సాగునీటిని వృథా కాకుండా సకాలంలో చేలకు మళ్లించుకోవాలని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ కోరారు. అత్తిలి మండలం పాలూరు, కొమ్మర, ఈడూరు, కొమ్మర గ్రామాల్లో మండల స్థాయి కమిటీ సభ్యులు పర్యటించి, సాగునీటి ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల ఆయకట్టు ప్రాంతాలకు సరఫరా అయ్యే కాలువలను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామివార్ల కల్యాణోత్సవాలు



బలుసులమ్మవారు



బల్లిపాడులో మదనగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బల్లిపాడులో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



లక్ష్మీనారాయణస్వామి

అత్తిలి: జిల్లాలో ప్రసిద్ధ వైష్ణవక్షేత్రం బల్లిపాడు రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామివారి వారి కల్యాణం గురువారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పుష్పాలతో అలంకరించిన మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి కల్యాణ తంతు నర్సాపురానికి చెందిన పెద్దింటి అనిల్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైఖానస ఆగమం ప్రకారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లపై పోసిన ముత్యాల తలంబ్రాలను భక్తులకు అందజేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తనయుడు సునీల్‌కుమార్ కల్యాణోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

తీర్థమహోత్సవం

మదనగోపాలస్వామివారి తీర్థమహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అరటిపండ్ల గెలలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు భారీ అన్నసమారాధన

స్వామివారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

ఏర్పాటుచేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు, యువకులు తమ సేవలను అందించారు. మదనగోపాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన మురళీ కోలాట భజన ఆకట్టుకుంది. భక్తులకు నందదీప్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మంచినీరు, రస్నా పంపిణీ చేశారు. దేవతా మూర్తుల విద్యుత్ దీపాల సెట్టింగులు ఆకర్షించాయి. తణుకు సీఐ ఆంజనేయులు, అత్తిలి ఎస్సై కేసీహెచ్ స్వామి పోలీసు బందోబస్తు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించి తరించారు. కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, కార్యనిర్వహణాధికారి చందక దారబాబు, మాజీ సర్పంచ్ ఆకుల పండు స్వామి, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ ఆకుల బులినాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి రథోత్సవం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి 82వ రథోత్సవం శుక్రవారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కారుమూరి సునీల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గురువారం రాత్రి స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఆలయ కమిటీ చైర్మన్ దుర్గ శివాజీ, ఈఓ సూర్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, దువ్వ పరిసర గ్రామాలకు చెందిన వేలాది భక్తులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మవారి చీరకు విరాళంగా వెండిని అందజేస్తున్న దృశ్యం

కేశవ స్వామి గరుడోత్సవం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో శ్రీ దేవీ, భూదేవి సమేత కేశవ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి గరుడోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి సహస్ర నామార్చన పూజలు, పల్లకీలో గరుడోత్సవం, సేవలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు.

బలుసులమ్మవారికి విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మవారి ఆలయంలో ఏకాదశి సందర్భంగా అమ్మవారికి అర్చకులు ప్రదీప్ శర్మ, గోపినాథ్ శర్మ, మల్లికార్జున శర్మ బ్రహ్మత్వంలో విశేష పూజలు చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు కొట్టు అంజిబాబు, వెలనాటి సత్తిబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



మండపాకలో కేశవ స్వామి గరుడోత్సవం

వాసవి ఆలయంలో..

తాడేపల్లిగూడెం వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో ఫాల్గుణ మాసం ఏకాదశి పురస్కరించుకొని క్షేత్రంలోని లక్ష్మీనారాయణ స్వామికి ఉదయం విఘ్నేశ్వర పూజ, మూల విరాట్‌కు పంచామృతాలు, సుగంద ద్రవ్యాలు, ఫల రసాలతో ప్రధాన పురోహితులు సత్యనారయణ శర్మ, నారాయణ శర్మ బ్రహ్మత్వంలో అభిషేకాలు చేశారు. స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ ఉండాలని ఆలయ కోశాధికారి నున్న సుందరం అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పూజలు చేశారు.

ముత్యాలమ్మవారికి వెండి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కొండ్రెడ్డి ఆనందరావు – సుబ్బలక్ష్మి దంపతులు శుక్రవారం 250 గ్రాముల వెండిని విరాళంగా అందజేశారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలో దేశాలమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. దేశాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు కాగా, మరో రూ.16 లక్షలు గ్రామస్తులు అందించారని చెప్పారు. సొసైటీ చైర్మన్ గుమ్మళ్ల తాతారావు, ఆలయ కమిటి చైర్మన్ సోమా మురళీ, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లమ్మవారి రథోత్సవం

పెంటపాడు: రావిపాడు గ్రామదేవత ముళ్లమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రావిపాడు, దువ్వ, కొండేపాడు, చింతపల్లి గ్రామాల్లో అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. ధర్మకర్త బొచ్చెల తాతారావు సోదరులు, సర్పంచ్‌లు కట్టా దానయ్య, పెన్నాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



వీకర్స్‌కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నీటి నిల్వలు దోమలకు నిలయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలైన వీకర్స్ కాలనీ పరిధిలో పలు వార్డుల్లో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం వల్ల వ్యాధులు ప్రబలుతాయని, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పెరుగుతున్న లార్వాను గుర్తించి నిర్మూలించాలని లక్ష్మణరావు సూచించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు సరళ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

తణుకు అర్బన్: ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తి తగ్గి వ్యాధులను నివారించుకోవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఫ్రైడే డ్రైడే పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వీరభద్రపురం ప్రాంత నివాసితులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. దోమకాటుతోనే పలు వ్యాధులు సోకుతున్నాయని హెచ్చరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడడంతోపాటు పాడైపోయిన టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు లేకుండా, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు మార్తమ్మ, పద్మజ, ఆశ కార్యకర్తలు కుమారి, వేణి, వలంటీర్లు ఉమామహేశ్వరి, సుకన్య, భాగ్యశ్రీ, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైల్వే గూడ్స్ షెడ్డు కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఆలిండియా రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి డి.రమేష్ బాబు, రాష్ట్ర యూనియన్ కార్యదర్శి డీవీఎస్ నర్సింహులు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నాయకులు సత్తి కోదండ రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గూడ్స్ షెడ్డులను ప్రైవేటీకరణ చేస్తోందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తదితర సంక్షేమాలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు కర్రి నాగేశ్వరరావు, సిరపరప రంగారావు, కరెడ్ల రామకృష్ణ, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ రెడ్డి, సాయి రెడ్డి, సుబ్బరెడ్డి, ఆంజనేయలు, నారాయణ, కృష్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ 50, వాణిజ్య సిలిండర్‌ను రూ.350 పెంచడాన్ని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు తీవ్రంగా ఖండించారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలోనే గ్యాస్ ధరలు అమాంతం పెరిగాయని విమర్శించారు. పెంచిన ధరలపై ప్రజలు ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



ఆర్టీసీ డిపోలో విజేతలకు బహుమతులు అందిస్తున్న మేనేజరు సత్యనారాయణమూర్తి

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ప్రయాణికులు గమనించాలని తణుకు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. ఏలూరు, గణపవరం రూట్లకు సంబంధించి తణుకు డిపోలో శుక్రవారం డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ ప్రయాణాన్ని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో సంస్థ ఎన్నో ప్రయోజనాలను ప్రయాణికులకు కల్పిస్తున్నట్టు సత్యనారాయణమూర్తి చెప్పారు. ఈ సందర్భంగా షాలేమ్ పెన్ కార్నర్ అధినేత అమర్‌నాథ్ సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగి కె.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలయోగి సేవలు మరువలేం

తణుకు టౌన్: లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి కోస్తా ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమ సంఘం (సేవాస్తంబ్) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొడ్డు విక్టర్ బాబు అన్నారు. జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా తణుకులోని సేవాస్తంబ్ కార్యాలయంలో శుక్రవారం బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా స్తంబ్ నాయకులు బాలయోగి చేసిన సేవలను కొనియాడారు. సేవా స్తంబ్ నాయకులు ఎంఎస్ సుకుమార్, నేలపూడి జయరాజు, జీఎస్ స్వరూప్, బండి ప్రసాద్, గుబ్బల శ్రీనివాసరావు, బీజేఐ రాజు, బి.వెంకటేశ్వరరావు, కడలి సత్యనారాయణ, పీసీహెచ్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

ఆరుగొలనువాసికి ఏలూరులో పింఛన్ అందజేత



సత్తెమ్మకు పింఛన్ అందజేస్తున్న మానస

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామానికి చెందిన గెడ్డం సత్తెమ్మ మోకాలు ఆపరేషన్ చేయించుకుని ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. గ్రామ వలంటీర్ కోలాటి మానస 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. మానసకు సత్తెమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్



మండపాకలో సేవలు అందించిన వైద్య సిబ్బంది

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్టు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బంగారు రవి తెలిపారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధితులకు బీపీ, సుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. హెచ్‌ఈఓ ప్రసాద్, హెచ్‌వీ వి.రాణి, ఎంపీహెచ్‌ఎస్ జయరాజు, ఎంపీహెచ్‌ఏ వైటీ మూర్తి, సుధా, విక్టోరియా, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాశంలో అద్భుతం

తాడేపల్లిగూడెం రూరల్: బృహస్పతి, శుక్రగ్రహాలు అతి దగ్గరగా రావడం అరుదుగా సంభవిస్తుంది. ఈ అద్భుతం మూడేళ్ల తర్వాత కనిసిస్తుంది. ఈ దృశ్యాన్ని తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో టెలిస్కోప్‌తో విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూముల శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సలాధి సుజ్ఞాన్‌రావు, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి రొక్కం శంకర్, ఫిజిక్స్ జేఎల్ బెల్లపు సత్యనారాయణ, తెలుగు జేఎల్ కుప్పాల రమేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణ కమిటీ ఏర్పాటు



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ సత్యవతి

తణుకు: తణుకు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నియంత్రణ కమిటీ ఏర్పాటు చేశారు. విద్యార్థులతోపాటు అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లను సభ్యులుగా చేర్చారు. ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి ఆధ్వర్యంలో శుక్రవారం యువతపై మత్తు పదార్థాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అమ్మకాలు, వినియోగంపై ఫోన్ నెంబర్లు 94409 02436, 63016 72663కు తెలియజేయాలని సీఐ సత్యవతి కోరారు. ఎస్సై టి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌డివిజన్ ఏర్పాటుకు కృతజ్ఞతలు



మంత్రి సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలో రెవెన్యూ సబ్‌డివిజన్, పోలీస్ సబ్‌డిజన్ల కార్యాలయాలు మంజూరు చేసినందుకు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడే రామారావు, ఏపీపీ శిరిగినీడి విజయకృష్ణ, న్యాయవాదులు ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి అభినందనలు తెలిపారు. మంత్రి కొట్టును దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పీతల సుధాకర్, హరిదాసుల రవీంద్రకుమార్, ఉంగరాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.